ప్రజాశక్తి
సోమవారం 28 జులై 2025
5
కర్నూలు

స్మార్ట్ మీటర్‌తో ప్రజలపై ఆర్థిక భారం

- అదానితో జరిగిన ఒప్పందంలో అవినీతి కుట్ర - సామాన్యులపై భారాలు సంపన్నులకు వరాలు
- ఆగస్టు ఐదున విద్యుత్ సౌధ ఎదుట ధర్నా - పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వం అదానితో చేసుకున్న సెకి ఒప్పందం వల్లనే స్మార్ట్ మీటర్లు బిగించి సామాన్య ప్రజలపై భారాలు వేస్తూ సంపన్నులకు వరాలను కురిపిస్తున్నా ప్రశ్నించేవారు లేకపోవడంతో మోడీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టడానికి సిద్ధమయిందని వక్తలు చెప్పారు. ఆదివారం కర్నూలు బిఎస్ఎ కళ్యాణమండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అదానీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అపార్టుమెంట్లకు ఆర్థిక భారం" అంశంపై గణేష్‌నగర్‌కు చెందిన పార్థసారథి టవర్స్ అడల్ట్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ బి. జయ రామ కృష్ణారెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించకపోతే రాబోవు రోజుల్లో ప్రజలపై చాలా భారాలు పడతాయని చెప్పారు. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరిస్తారని చెప్పారు. ప్రశ్నించేవారు లేకుంటే వారి అవినీతికి హద్దే ఉండదని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టేముందు ప్రజల నుండి అభ్యర్థనలను అడిగారని, వాటిని పరిగణలోకి తీసుకోలేదని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత గతంలో లాగా కాకుండా మూడు స్లాబుల పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఇలా విభజించి విద్యుత్ రేట్లు డిమాండ్‌ను బట్టి నిర్ణయిస్తారని చెప్పారు. మీటర్లు బిగించడానికి వస్తే ప్రజలు వ్యతిరేకించిన వారికి ఇప్పుడు బిగించుకుంటే ఉచితమని లేకుంటే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని తప్పుడు ప్రచారం చేస్తూ బిగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం బిగిస్తున్న మీటర్ల సంబంధించిన డబ్బులను కూడా రాబోయే రోజుల్లో బిల్లులతో సహా వసూలు చేస్తారన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి పోరాటం చేసే గుణం కర్నూలు ప్రజలకు ఉందని తెలిపారు. అదానీ, అంబానీ కోట్లకు అధిపతి అయిన వారు ప్రభుత్వ సహకారంతో ప్రకృతి వనరులను లూటీ చేయడమే వారి అజెండాగా మారిందన్నారు. అవినీతి చట్టమయితే విద్యుత్ చట్టం ద్వారా ముక్కలు చేసి (డిస్కం, ట్రాన్స్‌కో, ఎపిఎస్‌పి డిసిఎల్) అమ్మేయాలని చూస్తున్నారని చెప్పారు. రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి నాయకులు స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని చెప్పిన వారే నేడు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత రీఛార్జ్ పద్ధతిలో కరెంటు వాడుకోవాల్సి వస్తుందని డబ్బులు అయిపోయిన వెంటనే కరెంటు పోతుందని అన్నారు. డివైఎఫ్ఐ నాయకుడు నగేష్ మాట్లాడుతూ వాస్తవానికి ప్రస్తుత పరిస్థితులకు చాలా తేడా ఉంది. జగన్ చేసుకున్న సెకి ఒప్పందం వల్ల అదాని కంపెనీకి లాభం చేకూరుతుందన్నారు. ప్రస్తుతం ఉచితం అంటూ తర్వాత బిల్లుతో సహా వసూలు చేస్తారన్నారు. ప్రజలను చైతన్యం చేసి ఆగస్టు 5న విద్యుత్ సౌదా మందు జరుగు ధర్నాలో అందరూ కలిసి వచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ తాము వార్డులలో తిరుగుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై పడే భారాలను తెలియజేస్తూ కరపత్రాలను పంచుతూ, ఇండ్లకు స్మార్ట్ మీటర్లు వద్దని తెలియజేసే స్టిక్కర్లను కూడా అతికించామని తెలిపారు. ఇది అందరి సమస్య అని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఇంట్లో బాంబు పెట్టుకున్నట్లే అన్నారు. సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్ రైల్వే లాంటి సంస్థలను కూడా ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సంతోష్ నగర్‌కు చెందిన మార్కెటింగ్ రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ప్రకాష్‌రావు, చాంద్‌బాషా, చల్లావారి వీధికి చెందిన సూర్యనారాయణ, భాస్కర్ నగర్‌కు చెందిన జె. శ్రీనివాసులు, న్యాయవాది సుల్తాన్ బాషలు మాట్లాడుతూ విద్యుత్ భారం గురించి ప్రశ్నించకపోతే బెదిరించే వారిదే రాజ్యంలా మారుతుందని అన్నారు. అందరిని చైతన్యం చేసి స్మార్ట్‌మీటర్లు పెట్టే విధానాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. చివరిగా ఆగస్టు 1న విద్యుత్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎస్ఇకికి వినతి పత్రం అందజేయాలని తీర్మానించారు. అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. వివిధ అపార్టుమెంట్ల అసోసియేషన్ల అధ్యక్ష ,కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల నాయకుడు మద్దిలేటి, పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎం. నాగరాజు, సివి.వర్మ, మహమ్మద్ యూనుస్, కె.శ్రీనివాసులు, ఆంజనేయులు, రమణ గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయరామకృష్ణారెడ్డి

పేదల ఉపాధి కోసం కుట్టు శిక్షణ

- జిల్లాలో 25 కేంద్రాలు ఏర్పాటు
- బిసి కార్పొరేషన్ ఈడీ సయ్యద్ జాకీర్ హుస్సేన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పేద మహిలకు స్వయం ఉపాధే లక్ష్యంగా కుట్టుమిషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని కర్నూలు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో తాము చేపడుతున్న వివిధ సేవ పథకాలు గురించి ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు. ఆ వివరాలు ఇలా..

ప్రస్తుతం బిసి కార్పొరేషన్‌లో ఏ విధమైన పథకాలు అమలు చేస్తున్నారు..?

ఈడీ : బీసీ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతము ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. దీని ద్వారా పేద ప్రజలకు స్వయం ఉపాధికి అవసరమైన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.

జిల్లాలో ఎన్ని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు?

ఈడీ : కర్నూలు జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాల పరిధిలో 25 కుట్టుమిషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నాము. ప్రతి నియోజకవర్గానికి రమారమి కనీసం మూడు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం శిక్షణ చివరి దశకు చేరింది.

శిక్షణ కేంద్రంలో లబ్ధిదారులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ఈడీ : శిక్షణ కేంద్రంలో శిక్షణకు ఎంపికైన వారికి బోధించడానికి వీలుగా ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను, ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాం. వారు కుట్టు మిషన్‌లో కుట్టు విధానంలో ఉన్న మెలుకువలను నేర్పుతారు. కుట్టు మిషన్‌తో పాటు కుట్టు మెటీరియల్ శిక్షణ కేంద్రంలో అందుబాటులో ఉంచుతాం. వీటిని ఉపయోగించి శిక్షణ ఇస్తారు.

శిక్షణ పొందడానికి ఎవరు అర్హతలు ఏమిటి? శిక్షణ పూర్తయిన వారికి ఎలాంటి లబ్ధి చేకూరుతుంది?

ఈడీ : జిల్లాలో 3340 మందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా ఉంది. 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగిన బీసీ మహిళలు ఈ శిక్షణకు అర్హులు. ఇందులో ఈ బీసీ బీసీ కమ్మ కాపు క్షత్రియ వైశ్య ఇతర బీసీ కులాలు వారు ఈ శిక్షణ పొందడానికి అర్హులు. శిక్షణ 90 రోజులు ఉంటుంది. 90 రోజుల్లో కనీసం 75 రోజులు హాజరును శిక్షణకు ఎంపికైన వారు తప్పనిసరిగా కలిగి ఉండాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టు మిషన్ ను ఉచితంగా అందజేస్తాం. ఇప్పటికే కుట్టు మిషన్ ఉచిత శిక్షణ పూర్తి కావొచ్చింది. త్వరలోనే వారికి కుట్టుమిషన్లను అందజేస్తాం.

బిసి రుణాల పరిస్థితి ఏమి.?

ఈడీ : జిల్లాలో బిసి స్వయం ఉపాధి రుణాల అర్హుల జాబితా ప్రొసీడింగ్స్‌ను కలెక్టర్ ద్వారా అప్రూవల్ తీసుకొని బిసి కార్పొరేషన్ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపాం. సబ్సిడీని గరిష్ఠంగా పెంచే యోచనను ప్రభుత్వం చేస్తుంది. తాత్కాలికంగా ప్రస్తుతం రుణాల మంజూరు ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- కమిషనర్ ఇంటి ముందు ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి, ఎం.రాజశేఖర్, సీనియర్ నాయకుడు డి.పార్వతయ్య ,నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి. షరీఫ్ లు కమిషనర్ ను డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ నివాసం ముందు ఖాళీ బిందెలతో డి.అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన ఖల్లా ,బండి మెట్ట వాసులు ధర్నా చేశారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ సీనియర్ నాయకులు డి. పార్వతయ్య, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎండి.షరీఫ్ మాట్లుతూ సమస్య పరిష్కారమై మూడు రోజులవుతున్నప్పటికీ మంచినీరు సరఫరా చేయడంలో మునిసిపల్ అధికారులు, పాలకమండలి ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. తాగునీటి సమస్య ఇంత తీవ్రంగా ఉంటే కమిషనర్ నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని, అధికారపక్ష కూటమి ప్రభుత్వం మంత్రివర్యులు సమస్యపై ప్రత్యేక దష్టి సారించి ,తక్షణమే ప్రజలకు సరిపడా మంచినీటిని పుష్కలంగా అందించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని వారు తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామకృష్ణ, రవికుమార్, రెండో వార్డు రియాజ్, అబ్దుల్ సలాం, చాంద్ భాషా, ఖాజాబీ ,ఫాతిమా, సల్మాభి, ముంతాజ్ మహిళాసంఘం నాయకురాలు శేషమ్మ ,పద్మావతి, ఛాయ్ బాయ్, నర్సు బాయ్, ప్రమీల, లక్ష్మి ,సత్యమ్మ ,శుక్లాజి రావు, వలి, జగదీష్, హీరావలి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇంటి ముందు ఖాళీ బిందెలతో నిరసన చేపడుతున్న నాయకులు, మహిళలు

పారదర్శకంగా రైతులకు సేవలు

- పసుపల పిఎసిఎస్ అభివృద్ధికి కృషి
- పదవి స్వీకార మహోత్సవంలో చైర్మన్ బళ్లారి వెంకటరాముడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వ్యవసాయ పరపతి సహకార సొసైటీ ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలందిస్తానని, నూతన పసుపుల వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ బళ్లారి వెంకటరాముడు అన్నారు. ఆదివారం ఆయన కర్నూలు మండలం పసుపుల గ్రామంలోని వ్యవసాయ సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో కెడిసిసిబి సిఇఒ పి.రామాంజనేయులు ,పలువురు టిడిపి నాయకులు కార్యకర్తల సమక్షంలో ఆయన తొలి సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు.సొసైటీ డైరెక్టర్లుగా చంద్రమౌళి, రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.కెడిసిసిబి సిఇఒ రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో 5వ అతిపెద్ద బ్యాంకుగా పసుపుల సహకార సొసైటీ పేరుగాంచిందన్నారు. కెడిసిసిబి బ్యాంకు ద్వారా ఏడాది నుంచి షేర్ హోల్డర్లకు 6శాతం డివిడెంట్ పెంచే యోచనను చైర్మన్ చేస్తున్నట్లు తెలిపారు. 1949లో ఈ గ్రామ సొసైటీ ఏర్పడిందని, 5300 మందిలో 2000 మందికి పైగా రుణాలను అందజేసిందని అన్నారు. 102వ పసుపుల సొసైటీ ప్రత్యేక గుర్తింపును పొందిందన్నారు. మొదటి సూపర్ మార్కెట్‌ను కలిగిన సొసైటీగా గుర్తింపు ఉందని, దీనికోసం మాజీ సిఇఒ మురళి చౌదరి చేసిన కృషి ఎనలేనిదన్నారు. దీని పరిధిలో 11 గ్రామాలు ఉన్నాయన్నారు. డ్రోన్ ద్వారా రూ.300 ఎకరాలకు మందు పిచికారి చేసే సౌకర్యం ఉందన్నారు. కౌలు రైతులకు అత్యధిక రుణాలు ఇచ్చిన సొసైటీగా గుర్తింపు ఉందన్నారు. సొసైటీ నూతన చైర్మన్ బళ్లారి వెంకట్రాముడు మాట్లాడుతూ... సొసైటీ చైర్మన్‌గా ఎన్నికవ్వడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తొలిసారి తనకు రాజకీయాలను పరిచయం చేసిన గురువు రాంభూపాల్ చౌదరి అని అన్నారు. ఆయన తరువాత అత్యంత నమ్మకమైన నిస్వార్థంగా సేవ చేసే నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అని ఆయన వెంట నడవమని తనకు ఉపదేశించారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన వెంట నడుస్తూ వస్తున్నామన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకు విష్ణువర్ధన్ రెడ్డి ఈ పదవీ బాధ్యతలు అప్పగించారన్నారు. ఈ పదవిని బాధ్యతయుతంగా పారదర్శకంగా నిర్వహిస్తానన్నారు. సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఎరువులు, మందులు అందుబాటులోకి తెస్తానన్నా రు. రైతులకు రుణాలు అందజేస్తామన్నా రు. టిడిపి నాయకుడు నాగిరెడ్డి మాట్లాడుతూ సొసైటీ పదవి ఎంతో బాధ్యత కలిగిందని పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. బి.తాండ్రపాడు సర్పంచి వి.జయన్న మాట్లాడుతూ వేదికపై నిలబడి మాట్లాడుతున్నామంటే అందుకు కారణం కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన కుమారుడు రాజన్న ప్రోద్భలమే కారణమన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో సొసైటీని బలంగా అభివృద్ధి చేయాలన్నారు. బివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సొసైటీకి అధిక నిధులు సమీకరించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం చైర్మన్ ఇంటి వద్ద కేక్ కట్టింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని అభినందనలు తెలిపారు. గార్గేయపురం సొసైటీ చైర్మన్ ఫక్రుద్దీన్, మాజీ సర్పంచివేమనగౌడ్, మాజీసిఇఒ మురళిచౌదరి, టిడిపి నాయకులు బళ్లారివెంకటేశ్వర్లు, బళ్లారి శ్రీనివాసులు, నాయకులు నవీన్ సుమన్ మాజీ సర్పంచి కౌలుట్ల పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, చైర్మన్ వెంకటరాముడు

ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పివి సాయికుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వ్యవసాయ శాఖ ఉద్యోగులపై పని వత్తిడి తగ్గించాలని వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పివి.సాయి కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని కర్నూలు డివిజన్ కార్యాలయం సమావేశ భవనంలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పివి సాయికుమార్ మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో పరిపాలనాధికారుల, పర్యవేక్షణ అధికారుల, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు వెంటనే మంజూరు చేయాలన్నారు. త్వరగా స్పందించి ప్రమోషన్ల కొరకు తగు ఉత్తర్వులు ఇచ్చినందుకు వ్యవసాయ శాఖ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ చేస్తున్న జిల్లా అధ్యక్షులు కె.రవి ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవి ప్రకాష్, ఎంసీ కాశన్న, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విసిహెచ్.వెంగల్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కోడుమూరు తాలూకా అధ్యక్షులు, శ్రీనివాస్ యాదవ్, కమిషనరేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి అర్పిస్తున్న డాక్టర్ నాగస్వామినాయక్, డాక్టర్ శరత్ చంద్ర

మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆదివారం కర్నూలు నగరంలోని బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శరత్ చంద్ర , కళాశాల సిబ్బంది అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, ఉల్గోజి రావు ,విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ పారిశ్రామికవాడలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్ మండలం ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు.షాజహాన్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సిపిఎం మండల కార్యదర్శి నాగన్న, సిఐటియు జిల్లా నాయకులు గోపాల్, శ్రీధర్, రేణుకమ్మ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం స్కీమ్ వర్కర్లను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించి వారిసమస్యలను పరిష్కరించాలన్నారు. ఆటో డ్రైవర్లకు జీవో 21 ఎత్తి వేయాలని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల వేలాదిమంది ఆటో కార్మికులు రోడ్డున పడతారని, తక్షణమే ఆటో కార్మికులకు ప్రభుత్వమే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుల చేయాలన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగులో ఉన్న జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. సిఐటియు మండల అధ్యక్షులుగా ఎస్.షాజహాన్ మండల కార్యదర్శిగా జి. శ్రీధర్, మండల ఉపాధ్యక్షులుగా వి.సుధాకర్ ధనుంజయుడు, సహకార దర్శులుగా నాగభూషణ్ నాయక్ , విఎలరాజు మండల కమిటీ సభ్యులుగా సరళ, సువర్ణ, శోభారాణి, శ్యామల, మద్దయ్య, గోరంట్ల, రాజు, దస్తగిరి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రపంచవ్యాప్తంగా ఏటా పది లక్షలకు పైగా మరణాలకు దోమలే కారణమవుతున్నాయి. అంతరిక్ష యాత్రలు చేస్తున్న, సాంకేతికత ఎంత అభివృద్ధి సాధించినా మనం ఒక చిన్న దోమలను మాత్రం నివారించలేకపోతున్నాం. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

వర్షం కారణంగా నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తున్నాయి. అపరిశుభ్రమైన నీటి ద్వారా టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యం. వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల వైరస్ బ్యాక్టీరియాలు పెరుగుతాయి. దీంతో వైరల్ ఫీవర్, బ్యాక్టీరియా వల్ల ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. ఈ సమయంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో నిల్వ ఉన్న నీరు వలన దోమలు బ్యాక్టీరియాలు కేంద్రాల సంతానోత్పత్తి ప్రదేశంగా తయార వుతుంది. దోమల వ్యాప్తి వేగంగా పెరిగి వ్యాధులకు కారణ మవుతాయి.కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సీజన్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు అంటు న్నారు వైద్య నిపుణులు. వర్షాకాలం అంటేనే సీజనల్ వ్యాధుల కాలం వేసవి తర్వాత వాతావరణంలో జరిగే మార్పులు, వర్షాలు వాటి వల్ల నిల్వ ఉండే నీటిలో దోమలు ఆవాసాలను ఏర్పరుచుకుంటాయి. రోడ్లపై మురుగు నీరు ఉండడం ఇలా రకరకాల కారణాలవల్ల సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ముఖ్యంగా చిన్నారులు వర్షాకాలంలో సీజన్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. కనుక వర్షాకాలంలో తల్లిదండ్రులు ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.

తాగు నీటి ద్వారా వచ్చే వ్యాధులు: వర్షాకాలంలో తాగే నీరు కలుషితం రావచ్చు. కలుషిత నీటిని తాగడం మూలంగా కాలేయం దెబ్బతిని లివర్ పనితీరు దెబ్బ తింటుంది. కడుపునొప్పి, జ్వరం,వాంతులతో పాటు కళ్ళు పసుపు రంగులోకి మారతాయి. మూత్రం పసుపు పచ్చగా వస్తుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యున్ని కలిసి చికిత్స తీసుకోవాలి రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిపై కామెర్లు తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ వ్యాధులన్నీ కలుషితమైన నీళ్లు తాగడం వలన వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

జలుబు, జ్వరం: వర్షాకాలంలో సాధారణంగా వచ్చే సమస్యల్లో జలుబు జ్వరం సర్వసాధారణం. ఎందుకంటే ఈ సమయంలో వాతావరణంలో తేమ పెరిగి సూక్ష్మ క్రిములు, వైరస్‌లు బాగావృద్ధి చెందుతాయి.

డెంగ్యూ: డెంగ్యూ వైరస్ వల్ల వచ్చే దోమల వలన కలిగే వ్యాధి. అధిక జ్వరం, తలనొప్పి వాంతులు కీళ్ల నొప్పులు, చర్మ దద్దుర్లు ఈ వ్యాధి క్షణాలు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం . దీంతో పాటు దోమ తెరలు వాడాలి. మురుగు నిలువ లేకుండా చూడాలి.

కలరా: కలరా అనేది అతిసార వ్యాధి. కలరా కలుషిత నీటి ద్వారా, ఆహారం ద్వారా వచ్చే సమస్య. దీని ద్వారా జీర్ణాశయ సమస్యలు వస్తాయి. అతి వీరేచనాలతో ప్రారంభం అవుతుంది.

టైఫాయిడ్: కలుషిత ఆహారం, నీటి కారణంగా వస్తుంది. ఇది సాల్మొనేళ్ల టైఫీ వల్ల వచ్చే మరో బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సరైన పరిశుభ్రత, పారిశు ధ్యాన్ని పాటించడం వలన టైఫాయిడ్ ను నివారించవచ్చు. దద్దుర్లు, గులాబీ రంగు మచ్చలు ఈ వ్యాధిలో కనిపిస్తాయి.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి
- కె. రాజు ప్యాలకుర్తి గ్రామం



చీకటి పడితే చాలు ఎక్కడికి వెళ్ళినా దోమలు మోత విని పిస్తోంది. కాళ్ల మండి పోతున్నాయి. రాత్రి సమయంలో కంటిమీద కునుకు కరువైంది. అధికారుల స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డాక్టర్ నాగరాజు, సిహెచ్‌సి సూపరింటెండెంట్, కోడుమూరు



వర్షాకాలంలో నీరు ఎక్కువ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. మురుగు కాలువలు శుభ్రంగా ఉంచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నాగరాజు ప్రజలకు సూచించారు.

డాక్టర్ సాయి గౌతమ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మానవత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మానవతా సూచన సంస్థని నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని డాక్టర్ సాయి గౌతమ్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని మానవతా స్వచ్ఛంద కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ సాయి గౌతమ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నటువంటి వారికి ఎనలేని సేవలు తమ సంస్థ అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు జివి. రమణ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్ , ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ , యూనిట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ పాటిల్ హనుమంత్ రెడ్డి , మెంబర్షిప్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ నాదెండ్ల హరి కిషన్, నగర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రావు, పర్యావరణ కమిటీ చైర్మన్ వీర ప్రతాప్, సఖ్యత , శ్రీను, విజయ్ లు పాల్గొన్నారు.

సమన్వయంతో ఎత్తిపోతల నిర్వహణ

ప్రజాశక్తి-సి బెళగల్

రేమట ఎత్తిపోతలను సమన్వయంతోనే నిర్వహించుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సాగునిటీ రైతులకు, కమిటీకి సూచించారు. ఆదివారం కొత్తకోట దగ్గర పంపుహౌస్‌కు కమిటీ నాయకులు హరి, వెంకటేష్, అధికారులు డిఇ సుబ్బారాయుడు, ఎఇ దుర్గభవానిల సమక్షంలో ఎమ్మెల్యే చేసి స్విచ్‌ఆన్ చేశారు. తుంగభద్ర నదికి హారతిఇచ్చారు.

ఈర్లదిన్నే రైతు సేవా కేంద్రాన్ని తరలించొద్దు: ఎమ్మెల్యేకు వినతి

కొత్తకోటకు వచ్చిన ఎమ్మెల్యేతో ఈర్లదిన్నె గ్రామస్తులు వెంకటేశ్వర్లు రెడ్డి, శ్రీనివాసులు తదితరులు రైతు సేవా కేంద్రాన్ని కొత్తకోట కు తరలించే నిర్ణయంపై పునరాలోచించాలని వినతిపత్రం అందజేశారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందవేత : కొత్తకోటకు గ్రామానికి చెందిన కె. సునీల్ (20)కాన్సర్‌తో గతేడాది నవంబర్ లో మృతి చెందారు. ఒక్క గానొక్క కుమారుడు మృతి చెందగా ఒంటరిదైనా తల్లి పద్మావతికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.4 లక్షల చెక్కును అందజేశారు.

రేమట ఎత్తిపోతల వద్ద స్విచ్ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

రోడ్డు నిర్మాణంలో లోపించిన నాణ్యత

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో నెట్టేకల్ క్రాస్ ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర నుంచి ఆలూరు రోడ్డు వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించిందని, నేషనల్ హైవే అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు ఎవరూ లేకుండానే పనులు జరుగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, పిఎస్.రాధాకృష్ణ విమర్శించారు. ఆదివారం వారు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రూ.150 కోట్ల నిధులతో జరుగుతున్న పనుల్లో పర్యవేక్షణ లోపంగా ఉందని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో వాడాల్సిన కంకర, తారు సరైన మోతాదులో వాడడం లేదని, తారు మొత్తం లేచిపోయి కంకర తేలిన పరిస్థితి ఉందని చెప్పారు. కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ జోక్యం చేసుకొని రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి లింగన్న, పట్టణ, మండల కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, వీరారెడ్డి, డి.రామాంజనేయులు, జె.రామాంజనేయులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్

చలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వర రావు యాదవ్ కోరారు. ఆదివారం పట్టణంలోని భీమాస్ ఫంక్షన్ హాలులో బసవరాజు స్వామి అధ్యక్షతన చలో ఢిల్లీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉన్నారని, రాజ్యాధికారంలో మాత్రం బీసీలకు మొండిచేయి చూపుతూనే ఉన్నారని విమర్శించారు. జనాభా ధామాషా ప్రకారం పదవులు దక్కడం లేదని, ఇప్పటికీ అగ్రవర్ణాల కిందనే బీసీలు నలిగిపోతున్నారని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లును మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. సమస్యలు పరిష్కారానికి జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఆగస్టు 18, 19వ తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో మొదటి రోజు సెమినార్ నిర్వహించి, చివరి రోజు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. బీసీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రమేష్ యాదవ్, విరుపాక్షి స్వామి, రామనాథ్, అశోక్, ఈరన్న గౌడ్, కౌన్సిలర్ సురేష్, గోవిందరాజు, షేక్షావలీ ఉన్నారు.

హామీలు అమలు చేయని 'కూటమి' : వైసిపి

క్యూ ఆర్ స్కానర్ అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్రంలో అనేక హామీలిచ్చి కూటమి ప్రభుత్వంలో అమలు చేయడం లేదని వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని చింతకుంట గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రెండోరోజూ ప్రతి గడపకూ తిరుగుతూ చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ నిర్వహించారు. ఎంపిపి పెండేకల్లు ఈరన్న, వైసిపి నాయకులు బెట్టనగౌడ్, మహంతి స్వామి, ఈరన్న, వెంకటేష్, నరసింహులు, నాగరాజు, మునిస్వామి, కోసిగయ్య, నరసయ్య పాల్గొన్నారు.

'ఎరువులు అందుబాటులో ఉంచండి'

ఎరువులు పంపిణీ చేస్తున్న భీమారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రైతులకు అవసరమైన యూరియా ఎరువులను అందుబాటులో ఉంచాలని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 52 బసాపురం గ్రామంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లోనూ, ఎరువుల దుకాణాల్లోను ఎరువులు అందుబాటులో ఉండేవని తెలిపారు. నేడు కేవలం సొసైటీల్లో ఉంచడం వల్ల రైతులకు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని కావాల్సినన్నీ ఎరువు బస్తాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇలా ఉంటే.. నడిచేదెలా..?

- కనీసం గుంతలయినా పూడ్చని వైనం
- అధ్వానంగా రైల్వే ట్రాక్ రోడ్డు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం మారినా పరిస్థితులు మాత్రం యథావిధిగానే ఉన్నాయి. అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగు చేయిస్తాం అని చెప్పిన నాయకుల జాడ కనిపించడం లేదు. రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నా గుంతల్లో గంప మట్టి వేసిన పరిస్థితి లేదు. నియోజకవర్గంలో టిడిపి నాయకులు నోరు మెదిపే పరిస్థితి లేదు. నియోజకవర్గానికి బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి ప్రాతినిధ్యం వహించడం, మున్సిపల్ ఛైర్మన్‌గా సిహెచ్.లోకేశ్వరి వైసిపి తరపున ఉండడంతో ఏమీ పట్టనట్లుగా టిడిపి, జనసేన నాయకులు వ్యవహరిస్తున్నారు. సమస్య ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు.

అధ్వానంగా రోడ్డు : పట్టణంలోని డీఎస్పీ బంగ్లా భాష్యం స్కూల్ మీదుగా ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని రైల్వే గేట్ రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచి నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి ఉంది. పట్టణంలోని క్రాంతి నగర్, శంకర్ నగర్, ప్రకాష్ నగర్, కల్లుబావి, వైఎస్ఆర్ నగర్, రాజాసాహెబ్ నగర్ ప్రాంతాల చిన్నారులు భాష్యం స్కూల్, ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్, మిల్టన్ స్కూల్, సెయింట్ ఆంటోనీ హై స్కూల్‌కు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. రోడ్డు పూర్తిగా గుంతల మయం కావడంతో సైకిళ్ల మీద వెళ్లే చిన్నారులు అదుపు తప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. కనీసం మట్టితోనైనా గుంతలు పూడ్చి రాకపోకలకు అనుకూలంగా మార్చాలని కోరినా పట్టించుకునే వారే కరువయ్యారు. గతంలో కౌన్సిలర్లు ఉండగా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లేవారు. ప్రభుత్వం మారడంతో వారు కూడా సమస్యలను గాలికి వదిలి పట్టని విధంగా వ్యవహరిస్తున్నారు.

పెరిగిన రద్దీ : నేషనల్ హైవే రోడ్డు జగనన్న కాలనీ నిర్మాణ పనుల కోసం మట్టి తరలించే వాహనాలతో ఆ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ప్రధాన రోడ్లపై వెళితే ట్రాఫిక్ సమస్య ఉంటుందని క్రాంతినగర్, ధనాపురం, వైఎస్ఆర్ నగర్, కల్లుబావి, రాజాసాహెబ్ నగర్ ప్రాంతాలకు వెళ్లేవారు కూడా ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. గుంతలను దాటుకుంటూ వెళ్లే వారు 'అధికారులు ఉన్నారా, లేరా' అని ప్రశ్నించడం పరిపాటిగా మారింది. అధికారులు కనీసం గ్రావెల్‌తోనైనా గుంతలు పూడ్చి రాకపోకలకు అనుకూలంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

గుంతలమయమైన రోడ్డులో నిలిచిన నీరు

రోడ్లు బాగు చేస్తాం

- కృష్ణ మున్సిపల్ కమిషనర్

శివారు ప్రాంతాల్లో రోడ్ల బాగు కోసం చర్యలు తీసుకుంటాం. మట్టి రోడ్లు గుర్తించాం. త్వరలోనే సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తాం. ప్రజల సౌకర్యార్థం ఇబ్బందులు లేకుండా రాకపోకలకు అనుకూలంగా ఉండేలా మట్టితో గుంతలు పూడిపించేలా చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ నీరు నిలుస్తోంది. నివారణ చర్యలు చేపడతాం.

రాకపోకలకు ఇబ్బంది

- విద్యార్థి దీపక్, ఆదోని

రోడ్డు గుంతలమయంగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీళ్లు నిలుస్తున్నాయి. ఎప్పుడూ బురదమయంగానే ఉంటుంది. పాఠశాలకు వెళ్లే సమయంలో సైకిళ్లు అదుపు తప్పుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో కింద పడిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు మరమ్మతులు చేయించి రాకపోకలకు అనుకూలంగా ఉండేలా చూడాలి.

వివాహానికి అంగీకరించలేదని ప్రేమజంట ఆత్మహత్య

- పురుగుమందు తాగిన ప్రేమికులు

రాజు (ఫైల్)

ప్రజాశక్తి - చిప్పగిరి

యువతి, యువకుడు ప్రేమించుకున్న నేపథ్యంలో వారి పెద్దలు వివాహానికి ఒప్పుకోకపోవడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆది వారం చోటుచేసుకుంది. అధికారులు, గ్రామస్తుల వివరాల మేరకు... తిమ్మాపురం గ్రామానికి చెందిన మాల నాగరాజు కుమారుడు మాల రాజు (28) పురుగుమందు తాగారు. పెద్దలు గమనించి వెంటనే ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తీసుకెళ్లే సమయంలో మార్గమధ్యంలోనే మరణించినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతుడు రాజు గుంతకల్ పట్టణంలో అమ్మాయిని ప్రేమించారు. అక్కడ వారి పెద్దలు వివాహానికి ఒప్పుకోకపోవడంతో అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అమ్మాయిని ప్రేమించిన రాజు ఈ వార్తను విన్న వెంటనే తాను కూడా ఎందుకు బతకాలని వెంటనే ఇంట్లోనే పురుగుమందు తాగారు. చేతికొచ్చిన కొడుకు ఇలా పురుగు మందు తాగి మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి ఇద్దరు అక్కలు కూడా ఉన్నారు. సంఘటనను అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున పరిశీలించారు.

ఉరుకుంద దేవాలయానికి విరాళం

విరాళం అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మినరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1,38,123 విరాళంగా అందజేశారని దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆదివారం కర్ణాటకలోని బళ్లారికి చెందిన దాత కృష్ణ చైతన్యకు, స్వామి వారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం, బాండు పేపరు ఇచ్చి పూలమాలతో సన్మానించారు. దేవస్థాన పర్యవేక్షకులు జె.మల్లికార్జున, వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ జె.వీరేష్ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

బీవీ.మోహన్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - నందవరం

జననేత, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డికి తెలుగు తమ్ముళ్లు ఘనగా నివాళులర్పించారు. ఆయన 13వ వర్ధంతిని మండలంలో వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడారు. మాజీ మంత్రి బీవీ ప్రజల మనస్సును గెలుచుకున్న వ్యక్తి అని కొనియాడారు. ప్రజలతో స్నేహభావంగా ఉంటూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. మండల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. నందవరం టిడిపి కార్యాలయంలో బీవీ వర్ధంతి నిర్వహించారు. నాగలదిన్నెలో ఈరన్న, ఎన్ఎ.మునాఫ్, శేషాద్రి, తిమప్ప, (సుల్తాన్) మునాఫ్, ఉరుకుందు, రంగయ్య శెట్టి, రవిగౌడ్, మల్లేష్, గౌస్ పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం

- టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి గ్రామ నాయకులు చిన్న వెంకప్ప, కోలంట్ల తిమ్మప్ప వారికి ఘన స్వాగతం పలికి పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెర్నేకల్లు గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మండల నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, మల్లేపల్లి రంగడు, నాగరాజు గౌడ్, నాయకులు రాజు, తిమ్మప్ప, భాస్కర్, జాన్సన్ బాబు, ఐరన్‌బండ చాకలి లింగన్న పాల్గొన్నారు. **ఆదోని** నియోజకవర్గంలోని 42వ వార్డు హనుమాన్ నగర్‌లో కామ్లే నవీన్, ఏక్ బోటి సురేష్, దత్తాత్రేయ, ఏక్ బోటి నాగరాజ్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, నాయకులు ఫక్రుద్దీన్, బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఇస్వి శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, నాగరాజు, బిటి.శీన, మద్దికెర రామకృష్ణ, నారాయణపురం షాషావలీ పాల్గొన్నారు.

దేవనకొండలో పథకాలను వివరిస్తున్న నాయకులు

ఆదోనిలో మాట్లాడుతున్న సూరం భాస్కర్ రెడ్డి

పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఆలూరు

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు పట్టణ, గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి కోరారు. ఆదివారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో పంచాయతీ కార్మిక నాయకులు ఎల్లప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి, అర్హులైన వారికి ప్రమోషన్ కల్పించాలని కోరారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి దుస్తులు, ఆయిల్, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్మికులు అధ్యక్ష, కార్యదర్శులుగా నర్సప్ప, ఎల్లప్పను, 12 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు విఫలం

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - నందవరం

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలమయ్యారని వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక విమర్శించారు. మండలంలో పార్టీ బలోపేతానికి వైసిపి శ్రేణులు కృషి చేయాలని కోరారు. బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నందవరం మునిస్వామి సినిమా టాకీస్‌లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' నిర్వహించారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ జనసంద్రంతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనకు, గతంలో జగన్మోహన్ రెడ్డి పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు అనేక హామీలిచ్చారని, ఏడాది గడిచినా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం ఒక్క యూరియా బస్తా కావాలంటే ఉదయం నుంచి రైతులు లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఉందని మండిపడ్డారు. బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం హామీ ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. చంద్రబాబు మోసం చేయడంలో దిట్ట అని, ఈ విషయాలన్నీ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' ఉద్దేశం ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన బ్రోచర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు తేటతెల్లమవుతాయని చెప్పారు. కనకవీడు లక్ష్మీకాంత్ రెడ్డి, ముగతి విరుపాక్షి రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, సర్పంచి సావిత్రమ్మ, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర రెడ్డి, నది కైరవాడి చాంద్ బాషా, నరహరిరెడ్డి, నది కైరవాడి వెంకటేష్, పల్లె సూర్య ప్రకాష్ రెడ్డి, నరసరాజు, కోటేశ్వరరావు, హాలహర్వి సావిత్రమ్మ, చాందు తాత, నడిపి షేక్ సాబ్, మోహన్ రెడ్డి, గడ్డం ప్రకాష్ రెడ్డి, సోమన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుట్టా రేణుక

రోడ్డుకిరువైపులా ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని నిట్రవట్టి గ్రామం నుంచి హాలహర్వికి వెళ్లే వెళ్లే రోడ్డుకిరువైపులా ముళ్లకంపను తొలగించారు. ఆదివారం ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆదేశానుసారం నిట్రవట్టి ఎంపిటిసి గోపాల్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ముళ్లకంప వల్ల స్కూల్ బస్సు డ్రైవర్లు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఎంపిటిసి గోపాల్ తెలిపారు. శ్రావణమాసం మొదలవడంతో తమ గ్రామం మీదుగా దేవరగట్టు మల్లేశ్వర స్వామి, విరుపాపురం బోలుగట్టేశ్వర స్వామి దర్శనం కోసం కర్ణాటక నుంచి భక్తులు వెళ్తున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముళ్లకంపను తొలగిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యే విరుపాక్షికి, ఎంపిటిసి గోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు, మాజీ ఎంపిటిసి తిమ్మప్ప, ఉలికోటి లింగప్ప, మహాదేవ, జయరాం, గంగాధర, రమేష్, గాదిలింగ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన దేవరగట్టు

ప్రజాశక్తి - హోళగుంద

శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా మండలంలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలిసిన మాల మల్లేశ్వర సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. ఉదయం 6 గంటల నుంచి దర్శన నిమిత్తం భక్తులు క్యూ కట్టారు. స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంప, మహేష్ స్వాములు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. హాలహర్వి ఎస్ఐ మారుతి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున్న ఎస్ఐ

తుంగభద్రకు పెరిగిన నీటి ఉధృతి

- నదికి 1.40 లక్షల క్యూసెక్కులు విడుదల
- నదీతీర ప్రాంత ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యామ్‌కు వరద ఉధృతి పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఉధృతి పెరగడంతో నదికి 90 వేల క్యూసెక్కులు విడుదల చేస్తుండగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 1.40 లక్షల క్యూసెక్కులు విడుదల చేసినట్లు, నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర బోర్డు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరి, వర్నాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం మధ్యాహ్నం వరద రూపంలో తుంగభద్ర డ్యామ్‌కు 90 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వచ్చిన నీటి కన్నా ఎక్కువ దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు 30 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో నీటి నిల్వ 76 టిఎంసిలుగా ఉంది. అంతకుమించి నీటిని నిల్వ ఉంచుకోకపోవడానికి కారణం డ్యామ్ గేట్లు బలహీనంగా ఉండడమే. డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలుగా ఉండగా నీటి పారుదల నిపుణుల సూచనలతో 75 టిఎంసిలకే పరిమితం చేశారు.

హోళగుంద : 30 గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

ఉధృతంగా తుంగభద్ర

కౌతాళం : తుంగభద్ర నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. కర్ణాటక ప్రాంతం తుంగభద్ర జలాశయం పైభాగంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయానికి సుమారు 70వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి నదిలోకి భారీస్థాయిలో నీరు చేరడంతో తుంగభద్ర నది ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తోంది. మండలంలోని నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల్లో అధికారులు దండోరా వేయించారు. కౌతాళం మండలం మేలిగనూరు, నదిచాగి, కుంబాలనూరు, క్యాంప్, మరలి, గుడికంబాలి, వల్లూరు రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లను సురక్షిత ప్రాంతానికి తరలించారు. నదీతీరానికి అనుకుని ఉన్న వరి పంట సాగు చేసిన కొన్ని పొలాలు నీట మునిగాయి. ఇన్‌ఫ్లో పెరిగేకొద్ది నదిలోకి నీటి విడుదలను పెంచుతామని, నదిలోకి ఎవరూ వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.

కౌతాళం : ఉధృతంగా ప్రవహిస్తున్న నది

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- రిటైర్డ్ డీఎస్పీ రంగముని - వాల్మీకి విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఆలూరు

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని రిటైర్డ్ డీఎస్పీ రంగముని, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఈరన్న విద్యార్థులకు సూచించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు ఆదివారం ఆలూరు బాయ్స్-2 స్కూల్ ఆవరణలో పురస్కారాలు అందజేశారు. డేగలహాల్ తనుశ్రీ, కప్పట్రాళ్ల శైలజ, చింతకుంట వసంత, ఆలూరు నుంచి మధుబాబుకు బహుమతులు ప్రదానం చేసి మెమెంటో అందజేశారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు, వెంకటరెడ్డి, నాగరాజు, శేఖర్, నాగరాజు, వాల్మీకి నాయకులు తిక్కస్వామి, సుధా, చందు పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేస్తున్న నాయకులు

ఉరుకుంద సన్నిధిలో బుట్టా రేణుక

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో మాజీ ఎంపీ, వైసిపి ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్ట రేణుక కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ఆదివారం శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. వీరికి దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలలతో సన్మానించారు. దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ వీరేష్, అర్చకులు నాగరాజ్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న బుట్టా రేణుక

నూర్ బాష కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్ర మంత్రివర్గంలో నూర్ బాష సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలకన్న, జిల్లా ఉపాధ్యక్షులు బట్టల సత్తార్, మండల నాయకులు నూర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూర్ బాష సంఘం నాయకులు రాజా సాబ్, యాహియా ఖాన్, మస్తాన్, మోదీన్, చాంద్ బాషా, బడే సాబ్, బాష పాల్గొన్నారు. **ఆలూరు** ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలూరు నూర్ బాష దూదేకుల సంఘం నాయకులు, ఆలూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ శాలిసాహెబ్, టిడిపి సీనియర్ నాయకులు మాలిక్, చిప్పగిరి మండల కన్వీనర్ షేక్షావలీ మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన నూర్ బాష దూదేకులను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి తమ కుల సోదరులు నష్టపోయారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా దూదేకులకు చేయూతనివ్వడంతో రుణపడి ఉంటామన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దర్గా వలీ, మాబాష, హుస్సేన్ పీరా, మహ్మద్ రఫీ, ఖాసీం పాల్గొన్నారు.

దేవనకొండలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆలూరులో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

స్వామివారిని దర్శించుకుంటున్న వైసిపి నాయకులు

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

- నూతన ఆలయ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని కామన దొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభం, గోపుర, కలశ ప్రతిష్టాపన నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ దేవాలయం దగ్గరకొచ్చి పూజలు చేశారు. సిజిఎఫ్ ఎండోమెంట్ దేవదాయ శాఖ నుంచి రూ.40 లక్షలు ఆలయానికి మంజూరైనట్లు గ్రామస్తులు తెలిపారు. స్వామివారికి ఉదయం నుంచి ఆకు పూజ, కుంకుమార్చన, బిల్వార్చన, తుంగభద్ర జలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి సీనియర్ నాయకులు వై.సీతారామి రెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆలయ పెద్దలు వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు ఆర్లబండ మర్రిస్వామి తాత, హచ్చోళ్లి తాత ఆశీర్వాదం పొందారు. పెద్దలు శరణప్ప గౌడ్, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, కామనదొడ్డి నరసింహులు గౌడ్, జగదీష్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు నర్సిరెడ్డి, హనుమంతప్ప, యంకప్ప, అయ్యప్ప, సిద్ధప్ప, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- కైరుప్పల గ్రామంలో విషాదఛాయలు

శ్రీనివాసులు (ఫైల్)

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సిఐ మస్తాన్ వలీ వివరాల మేరకు... కైరుప్పల గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆత్మకూరులో ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నారు. శ్రీనివాసులు నగరూరులో పెళ్లి చేసుకున్నారు. శనివారం ఆత్మకూరు నుంచి బయల్దేరి కోడుమూరు దగ్గరకొచ్చి నగరూరుకు వస్తున్నానని భార్యకు ఫోన్ చేసి చెప్పారు. భార్య, బిడ్డను చూసేందుకు నగరూరు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తూ అర్ధరాత్రి అట్టేకల్లు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి ఆదోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతునికి భార్య పూజ, రెండేళ్ల కుమార్తె స్నేహ ఉన్నారు. పూజ ప్రస్తుతం 9 నెలల గర్భిణీ. శ్రీనివాసులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. శ్రీనివాసులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు. శ్రీనివాసులు మృతదేహానికి జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రథోత్సవం నిర్వహిస్తున్న పండితులు, అధికారులు

శ్రీమఠంలో భక్తుల సందడి

- వివిధ రథాలపై ఊరేగిన రాఘవేంద్రులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా శ్రీమఠం యాజమాన్యం క్యూలైన్ ఏర్పాటు చేసి దర్శనానికి అవకాశం కల్పించారు. స్వామివారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. సేవాదారులకు, భక్తులకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. రథోత్సవం సేవలు చేయించిన భక్తుల సమక్షంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను గజానోత్సవం కొయ్య వెండి స్వర్ణ నవరత్న స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిధ్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో రథోత్సవాలను వైభవంగా నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే 'కూటమి' ధ్యేయం

- టిడిపి మహిళా రాష్ట్ర నాయకులు వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి - చిప్పగిరి


సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మహిళా రాష్ట్ర నాయకులు వైకుంఠం జ్యోతి తెలిపారు. ఆదివారం చిప్పగిరిలో సిఐ రమేష్ బాబు నూతన గృహ ప్రవేశం, సత్యనారాయణ స్వామి పూజ, కసాపురం శ్రీరాములు కుమారుడు జయరామ్ వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిప్పగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా సభ్యత్వ నమోదు, సుపరిపాలనలో తొలి అడుగు చేపట్టి కార్యకర్తల్లో ఉత్సాహం నింపినట్లు తెలిపారు. అనంతరం వైకుంఠం జ్యోతిని టిడిపి నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు కొండ రామాంజనేయులు, పెద్దన్న, సత్తన్న, గారింటి జాన్, నేమకల్లు నాగరాజు, ఆలూరు రెహ్మాన్, వైకుంఠం జితేంద్ర పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి - ఆదోని

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని కార్వన్ పేట ప్రాంతంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు లక్ష్మన్న, తిప్పన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు నాగరాజు, చెన్నకేశవులు, ఎంకప్ప, ఎఐటియుసి జిల్లా నాయకులు యంకన్న, పిడిఎస్‌యు జిల్లా నాయకులు సోమశేఖర్, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న నాయకులు

ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఎస్ఐ శివాంజల్ చర్యలు చేపట్టారు. ఆదివారం శ్రీమఠం మేనేజర్ సి.సురేష్ కోనాపూర్‌తో కలిసి ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టనున్న చర్యలను వివరించారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్ నుంచి నాగలదిన్నె రహదారిలో శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న మూలరామ నిలయం ముందు భాగంలో పండ్లు, కూరగాయలు, చిరు వ్యాపారులు చేస్తున్న తోపుడు బండ్లను, కూరగాయలు పెట్టుకున్న వ్యాపారులను తొలగించాలని ఆదేశించారు. తనతో ఏం చెప్పుకున్నా ఉపయోగం లేదని, ఏదైనా ఉంటే శ్రీమఠం పీఠాధిపతులతో మాట్లాడుకోవాలని వ్యాపారులకు సూచించారు. సర్కిల్ నుంచి అతిథి గృహం వైపు బారికేడ్లు ఏర్పాటు చేయాలని మేనేజర్‌కు సూచించారు. భక్తులు ఎవరూ వాహనాలను నిలపకుండా అదే దారిలో శ్రీమఠం వారు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలిపే విధంగా భక్తులకు సూచనలు చేస్తామని ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఆగస్టు 8 నుంచి శ్రీమఠంలో జరగనున్న రాఘవేంద్రుని ఆరాధన మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిసింది. శనివారం కూడా ఆర్‌టిసి బస్టాండ్ వైపు జాతీయ రహదారిపై ఉన్న బంకులను, షెడ్లను తొలగించాలని ఎంపిడిఒ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, సిబ్బందితో కలిసి పరిశీలించిన విషయం తెలిసిందే.

భక్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఉప ప్రధాన అర్చకుడు పూజన్న మృతి పై విచారణ

ప్రజాశక్తి కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఉప ప్రధాన అర్చకుడు పూజన్న స్వామి మృతి పై శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఆదివారం ఉరుకుంద క్షేత్రానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. ముందుగా పూజన్న స్వామి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన మృతి పట్ల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాలయం కార్యాలయంలో దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయరాజు, ప్రధాన అర్చకుడు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకుడు మహాదేవ స్వామి, ముఖ్య అర్చకులను, దేవాలయ సిబ్బందిని విచారించారు. పూజన్న స్వామి మృతికి అనారోగ్యమా, దేవాలయ అధికారులు వేధింపుల, లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. పూజన్న స్వామికి బీపీ షుగర్ ఉండడం వల్ల సరైన మందులు వాడకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఆయన తెలిపారు. ఈ విచారణ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

విచారిస్తున్న శ్రీశైలం ఇఒ శ్రీనివాసరావు

హెపటైటిస్ పై అవగాహన అవసరం

-నేడు అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం-డాక్టర్ కె నవీన్ కుమార్-కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కిమ్స్ హాస్పిటల్స్, కర్నూలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జులై 28న నిర్వహిస్తారు. దీని ముఖ్య ఉద్దేశం వైరల్ హెపటైటిస్ వ్యాధి వల్ల కలిగే ప్రపంచ వ్యాప్తి భారాన్ని, దీని గురించి అవగాహన పెంచడం. వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వాలు కలిసి హెపటైటిస్‌ను అరికట్టడంలో ప్రయత్నం చేయాలి.

ఈ సంవత్సరం 'హెపటైటిస్ మనం విడమర్చి ఆలోచించుదాం' అనే థీమ్ తో ముందుకు వెళ్తున్నారు. అంటే హెపటైటిస్ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఈ సంవత్సరం థీమ్ తెలియజేస్తుంది. హెపటైటిస్ గురించి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కె.నవీన్ కుమార్ మాటలలో అసలు హెపటైటిస్ అంటే ఏమిటి? హెపటైటిస్ అనేది కాలేయానికి సంబంధించినది. ఇది సాధారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కలుగుతుంది. కానీ ఇతర కారణాలు కూడా ఉండవచ్చు, ఉదాహరణకు వ్యాధులు, మందులు, మత్తు పదార్థాలు, విషాలు , మద్యం తీసుకోవడం వల్ల వైరల్ హెపటైటిస్ ఐదు ప్రధాన రకాల వైరస్‌ల ద్వారా కలుగుతుంది. ఎ, బి, సి, డి, ఇ రకాలుగా ఉన్నాయి.

హెపటైటిస్ ఎ: ఈ వ్యాధి హెపటైటిస్ ఎ వైరస్ ద్వారా వస్తుంది. కలుషిత ఆహారం, నీరు ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేని చోట హెపటైటిస్ రోగులు ఎక్కువగా కనిపిస్తారు. మూడు నెలల్లో ఈ వ్యాధి లక్షణాలు క్రమంగా కనుమరుగవుతాయి. కానీ హెపటైటిస్ ఏ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. ఈ వ్యాధి లక్షణాలు ఇన్ఫెక్షన్ సోకిన 14 నుంచి 28 రోజుల తరువాత బయటపడతాయి జ్వరం, ఆకలి తగ్గిపోవడం, డయేరియా, కామెర్లు వంటివి కొన్ని లక్షణాలు.

హెపటైటిస్ బి : 'కలుషిత రక్తం, ఇతరులు వాడిన సూదులు, శరీర ద్రవాలు హెపటైటిస్ బి ఇన్ఫెక్షన్‌ను కలగచేస్తాయి. తల్లి నుంచి పిల్లలకు సంక్రమించే అవకాశం కూడా ఉంది' డ్రగ్స్ వాడేవారిలో హెపటైటిస్ వ్యాధి సాధారణం. ఈ వ్యాధి బారిన పడినవారు రెండు నెలల్లోపు పూర్తిగా కోలుకుంటారు. కానీ కొంతమంది దీనివల్ల తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. దీనిని 'క్రానిక్ హెపటైటిస్'గా పిలుస్తారు. ఇది లివర్ సిరోసిస్‌కు, లివర్ కాన్సర్‌కు కారణమవుతుంది. హెపటైటిస్ బీ హెచ్ఐవి కంటే 50 నుంచి వందరెట్లు ఎక్కువ అంటువ్యాధి. కామెర్లు, బలహీనత, వాంతులు, పొత్తికడుపునొప్పి ఈ వ్యాధిలో కనిపించే సాధారణ లక్షణాలు 6 ఏళ్ళ లోపు పిల్లలకు ఈ వ్యాధి సోకితే అది మొండిరోగంగా మారే ప్రమాదం ఉంది. హెపటైటిస్ బికి ఇప్పుడు టీకా లభిస్తోంది.

హెపటైటిస్ సి: ప్రధానంగా రక్తం ద్వారా సంక్రమించే వ్యాధి హెపటైటిస్ సి కొన్ని సందర్భాలలో లాలాజాలం, వీర్యం, యోని ద్రవాల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. 'కలుషిత రక్తం ద్వారా లేదా, ప్రసవ సమయంలో తల్లి నుంచి బిడ్డకు కూడా హెపటైటిస్ సి సోకే అవకాశం ఉంది' వైరస్ శరీరంలోకి ప్రవేశించిన 2 నుంచి 6 వారాల తరువాత ఈ వ్యాధి లక్షణాలు బయటపడతాయి. 80 శాతమంది రోగులలో ఎటువంటి లక్షణాలు కనిపించవు జ్వరం, బలహీనత, కామెర్లు, ఆకలి తగ్గిపోవడం, వాంతులు, పొత్తికడుపు నొప్పి, నల్లటి రంగులో మలం రావడం దీని లక్షణాలు.

హెపటైటిస్ డిఇ: హెపటైటిస్ బితో బాధపడే రోగులలో హెపటైటిస్ డి తిష్ట వేస్తుంది. హెపటైటిస్ డి వైరస్ సోకాలంటే హెపటైటిస్ బి అవసరం ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా 5శాతం మంది హెపటైటిస్ బి రోగులలో హెపటైటిస్ డి కనిపిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ ఇంజెక్షన్ల ద్వారా, పచ్చబొట్లు, కలుషిత రక్తం వల్ల వ్యాపిస్తుంది. జ్వరం, బలహీనత, కామెర్లు, ఆకలి తగ్గిపోవడం, వాంతులు, పొత్తి కడుపు నొప్పి, నల్లటి మలం తదితర లక్షణాలు కనిపిస్తాయి. హెపటైటిస్ ఈ అనేది చాలా స్వల్ప ప్రభావాన్ని చూపుతుంది. తక్కువ కాలం మాత్రమే ఉంటుంది. ఎక్కువగా కలుషిత నీటి ద్వారా వ్యాపిస్తుంది. ప్రపంచంలోని అన్ని దేశాలలో ఈ వ్యాధి కనిపిస్తుంది. ముఖ్యంగా తూర్పు, దక్షిణ ఆసియాలో మరీ సాధారణం.



ఎఎస్ఐ పేరుతో రూ.50 వేలు టోకరా..!

- యువకుని వద్ద రూ.50 వేలు వసూలు

- మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు



ప్రజాశక్తి - హోళగుంద

డబ్బులు సంపాదించేందుకు కొందరు అక్రమార్కులు ఏకంగా పోలీసుల పేరు చెప్పుకొని ఓ యువకుని వద్ద రూ.50 వేలు వసూలు చేసిన సంఘటన శనివారం హోళగుందలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... తాను హోళగుంద పోలీసు స్టేషన్ ఎఎస్ఐ హనుమంతు అంటూ హోళగుందకు చెందిన (పేరు చెప్పేందుకు ఇష్టపడని) యువకునికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి తనను పరిచయం చేసుకున్నాడు. 'కర్నూలు నుంచి మాట్లాడుతున్నాను. హోళగుంద పోలీసు స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుల్ కుమార్తెకు యాక్సిడెంట్ అయింది. వెంటనే చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలి. నా వద్ద రూ.50 వేలు లిక్విడ్ క్యాష్ ఉంది. ఫోన్‌పేలో లేకపోవడంతో నువ్వు రూ.50 వేలు ఫోన్ పేలో వేసి, పోలీసు స్టేషన్‌కు వెళ్లి డబ్బులు తీసుకో' అంటూ చెప్పాడు. ఆ యువకుడు ఫోన్ పే ద్వారా ఆగంతకుడు ఇచ్చిన ఫోన్ పే నెంబర్‌కు రూ.50 వేలు వేశారు. అనంతరం స్టేషన్‌కు వెళ్లి ఆగంతకుడు చెప్పిన పేరుతో విచారించగా అలాంటి వారు ఎవరూ ఇక్కడ విధులు నిర్వహించడం లేదని పోలీసులు చెప్పడంతో ఆ యువకుడు ఆశ్చర్యానికి గురయ్యారు. మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు.

సుబ్బారెడ్డి నియామకాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీలో నిబంధనల విరుద్ధంగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుబ్బారెడ్డి నియామకాన్ని రద్దు చేయాలని అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. రాఘవేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు, పాలకమండలి సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సుబ్బారెడ్డి నియామకాన్ని చేపట్టారన్నారు. ఆయనకు ఆరియర్స్ కూడా వర్సిటీ నిధులను విడుదల చేసిందన్నారు. తక్షణం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి రాయలసీమ వర్సిటీ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా కోడుమూరు మండలం పులకుర్తి, కొత్తూరు గ్రామాలలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఆదివారం డోర్ టు డోర్ కార్యక్రమం కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయాలను ప్రజలకు వివరించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ వంటి పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు ఉగాది వెంకటేశ్వర్లు, ఎం. చంద్రమౌళి, సీతారాములు, రాఘవేంద్ర, యూసుఫ్, విజయ్, షేక్షావలి, తులసి రెడ్డి, బూత్ ఇంఛార్జి లు శేకర్, సునీల్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ప్రజాశక్తి -వెల్దుర్తి

వెల్దుర్తి మండలం కృష్ణాపురం, కలుగొట్ల, పుల్లగుమి గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాం కుమార్ ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, పాల్గొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎం. సుబ్బరాయుడు మాట్లాడుతూ పేదరికానికి కూడా ముగింపు ఇచ్చేలా మద్దతు ధరలు, పంటబీమా, ఉచిత ఇసుక, పెంచిన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, పిహెచ్ సిల్లో మెరుగైన సేవలు ,విద్యార్థులకు తల్లికి వందనం , స్కూళ్ల ఆధునికీకరణ, మహిళలకు డ్వాక్రా బలోపేతం, ఉచిత రేషన్, మహిళా భద్రత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కలుగోట్ల సర్పంచి మద్దిలేటి, సుబ్బారెడ్డి, సరోథం, పుల్లగుమి నాగేశ్వరరెడ్డి మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వరరెడ్డి ,ఎం.జయరాముడు, సుద్దేపల్లి ఎంపిటిసిరామజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టం చేసే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ఎపి రజక వృత్తిదారుల సంఘం పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న ఎపి రజక వృత్తిదారుల జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురు శేఖర్

ఎపి రజక వృత్తిదారులకు నష్టం చేసే స్మార్ట్ మీటర్లు బిగించే పద్ధతి వెంటనే విరమించుకోవాలని ఎపి రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, వృత్తిదారుల సమన్వయ కమిటీ సీనియర్ నాయకులు జి. రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు ఐలమ్మ కార్యాలయంలో ఎపి రజక వృత్తిదారుల సంఘం కర్నూలు నగర కమిటీల సమావేశం నిర్వహించారు. కర్నూలు న్యూ సిటీ నగర అధ్యక్షులు సి.రాముడు అధ్యక్షత వహించారు. జి రామకృష్ణ, సి.గురుశేఖర్, నగర కార్యదర్శి సి .శేషాద్రి, జిల్లా కోశాధికారి సిహెచ్. శ్రీనివాసులు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రజక వృత్తిదారులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరా టం చేస్తున్న సంఘం ఎపి రజక వృత్తిదారుల సంఘమని అన్నారు. ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, ఇంటి పన్ను, కరెంటు చార్జీలు, రైల్వే ,బస్సు చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించి పనులు చూపించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వారి ఆస్తులు పెంచడం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజలను విస్మరించాయన్నారు. అదాని కార్పొరేట్ కంపెనీ, స్మార్ట్ మీటర్ల ఒప్పందం చేసుకుని ఆంధ్ర రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే చేనేత, క్షౌర, రజక, కంసాలి తదితర వృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చే 200 యూనిట్ల వరకు సబ్సిడీ కరెంటు ఇవ్వకుండా ఆగిపోయే పరిస్థితి ఉందన్నారు. రైతులకు ఇచ్చే ఉచిత కరెంటు కూడా అందకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. కరెంటు విద్యుత్ సంస్థలను ప్రభుత్వమే నిర్వహిస్తే ప్రజలకు సబ్సిడీ కరెంటు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆదాని కంపెనీ స్మార్ట్ మీటర్ కనుక పెడితే ప్రజలకు సబ్సిడీ కరెంటు అందకుండా పోయే పరిస్థితి ఉన్నది. అందుకనే చేతివత్తిదారులు, బీసీలు, రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజలను చైతన్యం చేసి స్మార్ట్ మీటరు పెట్టొద్దు అంటూ పోరాటం చేయాలన్నారు. ఎపి రజక వృత్తిదారుల సంఘం అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటానికి పిలుపునిచ్చింది. దళితులను, బీసీలను వృత్తిదారులను, మైనార్టీలను రైతులను ఐక్యం చేసి ఉద్యమాన్ని చేపట్టబోతున్నామన్నారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ పోరాటానికి, ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల ముందు జరిగే ధర్నా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున రజక వత్తిదారులు పాల్గొనాలని నగర కమిటీ పిలిపిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ , జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య ,రమణ, రేణుక, పుష్ప, ఓల్డ్ సిటీ ,న్యూ సిటీ కమిటీ సభ్యులు, మద్దిలేటి, మధు ,వీరేష్, నెట్టికంటయ్య, పకీరప్ప, కురుమూర్తి, ఈశ్వరమ్మ, పకిరమ్మ, భీమరాజు, గోవిందు, ఎల్లప్ప, నరసింహులు, రామదాసు అపార్ట్మెంట్ వాచ్మెన్ నాయకులు రాజు, అంజి, మధు మొదలగు వారు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఎస్‌పిజి క్రైస్ట్ చర్చ్ ఎన్నికలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

నగరంలోని చిల్డ్రన్ పార్క్ దగ్గర ఉన్న ఎస్‌పిజి క్రైస్ట్ చర్చి1లో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపించాయి. సుమారు 1300 ఓట్లకు రెండు ప్యానెల్స్‌గా సభ్యులు పోటీలో నిలవగా, కొందరు ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. ఎన్నికల అధికారిగా నంద్యాల డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ పిఎ వర ప్రసాద్‌రావు వ్యవహరించగా, రిటర్నింగ్ అధికారులుగా పాస్టర్ ఐజక్ ప్రసన్న, జాన్సన్ , థీయోడర్, కలకత్తా రవికుమార్ వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించిన ఎన్నికలు సాయంత్రం 7 గంటలకు ముగిసాయి. సుమారు వెయ్యి మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల కౌంటింగ్ రాత్రి నిర్వహించి, ఫలితాలు సోమవారం ఉదయం ప్రకటిస్తారని రెవరెండ్ వరప్రసాద్ రావు తెలిపారు.

చర్చి ఎన్నికలకు భారీగా తరలివచ్చిన క్రైస్తవులు

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడం లో వైఫల్యం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదోన్నతులు,బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ ఎస్‌టియు భవనంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి టికె. జనార్దన్ అధ్యక్షతన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గోకారి మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్, పోజీషన్ ఐడిలను క్రియేట్ చేసి జీతాల బిల్లుల గడువును పొడిగించి తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఇస్మాయిల్ సాహెబ్, అబ్దుల్‌రహీం, దేవదాసు, మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రవాహ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్. అల్తాఫ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహానికి ప్రవారిగోడ, లేనందున విషపురుగులు రావడం, బాత్‌రూమ్స్, తాగునీరు లేక విద్యార్థులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను హాస్టల్‌లో వదిలి వారి తల్లిదండ్రులు వారి జీవన ఆధారం కోసం వలసకు హైదరాబాద్, గుంటూరు, బెంగుళూరుకు వెళ్తారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును ఉన్నత అధికారుల దృష్టిలో ఉంచుకొని తక్షణమే ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహానికి ప్రవాహ గోడ ను ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ హాస్టల్ సందర్శన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు వీరంజినేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు..